RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య



## ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి ఘనంగా నిర్వహింపు



**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 6 (వార్త సంధ్య ) :** మహోన్నత విద్యావేత్త, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా సింగరేణి మండలం రావొజితండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి. బాలు , పంచాయతీ కార్యదర్శి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్, పాఠ శాల విద్యార్థులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొని జయశంకర్ గారి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన సేవలను, విద్యారంగంలో అందించిన విశిష్ట సేవలను స్మరించుకుని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు

## పరిసరాల పరిశుభ్రత - పోషకాహారం తీసుకోవాలి :భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హిరలాల్



**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 6 (వార్త సంధ్య ) :** సింగరేణి మండలం భాగ్యనగర్ గ్రామంలోని ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు సురక్షితమైన మంచినీటిని ఉపయోగించాలని, ఆరోగ్య శాఖ సిబ్బంది అందించే సలహాలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ అన్నారు. గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, పోషకాహారం ప్రాముఖ్యతపై ప్రజలకు వివరించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భిక్కులాల్, వార్డు సభ్యులు గాంధీ, కిషన్, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు, తల్లులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు

## గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లింపు :గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్



**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 6 (వార్త సంధ్య ) :** సింగరేణి మండలం గాదెపాడు గ్రామం లో వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలోని గాదెపాడు, ఒడ్డుగూడెం, చర్లపల్లి గ్రామాల్లో విస్తృతంగా బ్లీచింగ్ పౌడర్ చల్లింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి వీధి, నీటి నిల్వ ఉన్న ప్రాంతాలు, పెంటకుప్పల పరిసరాల్లో గ్రామపంచాయతీ సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ చల్లించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని గాదెపాడు సర్పంచ్ మరియు గ్రామపంచాయతీ కార్యదర్శి స్వయంగా పర్యవేక్షిస్తూ, గ్రామంలోని ప్రతి వీధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణకు గ్రామపంచాయతీ చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలకు సహకరించాలని అధికారులు సూచించారు.

## ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా ఘన నివాళులు పేరుపల్లి సర్పంచ్ : పద్మావతి విరభద్రు



**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 6(వార్త సంధ్య) :** సింగరేణి మండలం పేరుపల్లి గ్రామ పంచాయతీ ఆఫీస్ లో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోతు పద్మావతి, కాంగ్రెస్ నాయకులు మల్లెల నాగేశ్వరరావు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ గారికి తెలంగాణ పట్ల ఉన్న అపారమైన నిబద్ధత, దార్శనికత, త్యాగం, ఉద్యమ స్ఫూర్తి చిరస్మరణీయమని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన కృషి, సమాజానికి అందించిన మార్గదర్శకత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్, మాజీ ఉప సర్పంచ్ బుడిగ ప్రభాకర్, కల్లూరి హైమావతి, ఎల్లబోయిన నరసింహరావు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ గారికి ఘనంగా నివాళులర్పించారు.

## ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు కట్టుబడి ఉండాలి

### మంథని ఉద్యమకారుల ఆధ్వర్యంలో

### ఘనంగా ఆచార్య జయశంకర్ 92వ జయంతి వేడుకలు





**మంథని, ఆగస్టు 06( వార్త సంధ్య) :** తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యం లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ ఆచార్య జయ శంకర్ 92వ జయంతి వేడుకలను గురువారం మంథని పట్టణంలోని బొక్కలవాగు బ్రిడ్జిపై ఉన్న ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేల్పుల గట్టయ్య, మంథని విజయ్ కుమార్, లు మాట్లాడుతూ,తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి ఆచార్య జయశంకర్ జీవితాంతం అంకితభావంతో కృషి చేశారని అన్నారు. స్వరాష్ట్ర సాధనను తన జీవిత లక్ష్యంగా మార్చుకుని, నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని శాస్త్రీయంగా, ఆధారాలతో దేశానికి చాటిచెప్పిన మహోన్నత మేధావి జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత బలాన్ని అందించడంలో ఆయన పాత్ర చిరస్మరణీయమని, భావజాలానికి రాజకీయ రూపం కల్పించి తెలంగాణ రాష్ట్ర సాధనకు మార్గదర్శకుడిగా నిలిచారని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి తెలంగాణ వాది బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్ధిల్లు తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు కొండేలా మారుతి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి జాడి జంపయ్య, సీనియర్ ఉద్యమ నాయకులు రామడుగు మారుతి, ముస్కుల ప్రభాకర్ రెడ్డి, మంథన సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో దొంగల రాజ్యం సాగుతోంది - కూనంనేని

### జిల్లాలో ఘనంగా ప్రారంభమైన సీపీఐ ప్రజాచైతన్య యాత్ర





**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఆగస్టు 06 (వార్త సంధ్య) :** దేశంలో బీజేపీ పాలనలో దొంగల రాజ్యం సాగుతోందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం "బద్లావ్ జరూరీ హై" అంటూ మార్పు అనివార్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని ఏడూళ్లబయ్యారం గ్రామంలో గురువారం ప్రజాచైతన్య యాత్రను సీపీఐ జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభానికి ముందు ఏఐటీయూసీ, సీపీఐ కార్యాలయాల్లో జెండాలు ఆవిష్కరించిన అనంతరం బయ్యారం క్రాస్‌రోడ్, రామానుజవరం, మణుగూరు, అశ్వాపురం మీదుగా మొండికుంట వరకు యాత్ర కొనసాగింది. డప్పు వాయిద్యాలు, జానపద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, ప్రజలు అడుగడుగునా యాత్రకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణ, కార్మిక హక్కుల హననం, రైతుల సమస్యలు, దళితులు, ఆదివాసీలపై పెరుగుతున్న దాడులు ప్రజావ్యతిరేక పాలనకు నిదర్శనమని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ అంశంపై యువత చేసిన పోరాటం కేంద్రాన్ని దిగివచ్చేలా చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో పాటు పేదలకు ఇళ్ల నిర్మాణం, పెండింగ్ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. సింగరేణికి ఓసీ--2 డీప్‌సైడ్ బొగ్గు బ్లాక్ కేటాయింపులో సీపీఐ - ఏఐటీయూసీ ఐక్య పోరాటాలే కీలక పాత్ర పోషించాయని అన్నారు. గోదావరి జలాలను ముందుగా భద్రాద్రి జిల్లాకు అందించి, అనం తరం ఇతర ప్రాంతాలకు తరలించాలని, పోడు భూములకు పట్టాలు, నిర్వాసితులకు న్యాయమైన పరిహారం, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని ప్రభుత్వాలను కోరారు.

ఈ కార్య క్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీకుమారి, ఎస్.డి. సలీం, కే. సారయ్య, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, కమటం వెంక టేశ్వర రావు, మువ్వా వెంకటేశ్వరరావు, రేసు ఎల్లయ్య, దేవర కొండ శంకర్, యూ. రాహుల్, ఎస్.కే. ఫహీమ్‌తో పాటు మహిళా, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పేరుతో అప్పుల భారమా?

### రూ.300 కోట్ల విదేశీ రుణంపై కొత్తగూడెం కార్పొరేషన్‌లో రాజకీయ రగడ

### కౌన్సిల్‌ను పట్టించుకోకుండా డీపీఆర్ పంపారంటూ బీజేపీ ఫైర్

### డీపీఆర్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్

### విలేకర్ల సమావేశంలో బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఆగస్టు 06 (వార్త సంధ్య) :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనుల కోసం జర్మన్ బ్యాంకు నుంచి రూ.300 కోట్ల రుణం తీసుకునేందుకు డీపీఆర్ (డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్టు) ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారనే అంశం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై భారతీయ జనతా పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. లక్ష్మీదేవిపల్లిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, ఇండిపెండెంట్ కార్పొరేటర్ కంభంపాటి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజాప్రతినిధులతో కనీస చర్చ కూడా నిర్వహించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కౌన్సిల్ ఆమోదం లేకుండానే అభివృద్ధి పేరుతో జర్మన్ బ్యాంకు నుంచి రూ.300 కోట్ల రుణం కోసం డీపీఆర్ ప్రతిపాదనలు పంపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.

**అభివృద్ధి పేరుతో అప్పుల భారం?**

కార్పొరేషన్‌లో పారదర్శకత పూర్తిగా లోపించిందని, ప్రజా అవసరాల కంటే కమిషన్లు, స్వప్రయోజనాల కోసమే విదేశీ రుణాల వైపు పాలకవర్గం మొగ్గు చూపుతోందని ఆరోపించారు. భవిష్యత్తులో ప్రజలపై అప్పుల భారం మోపే నిర్ణయాలను తొందరపాటుగా తీసుకోవడం సరికాదన్నారు.

**డీపీఆర్ రద్దు చేయాలని డిమాండ్**

ఇప్పటికైనా ఏకపక్ష నిర్ణయాలను విరమించి, రూ.300 కోట్ల రుణ ప్రతిపాదనను కౌన్సిల్ సమావేశంలో సమగ్రంగా చర్చించాలని కోరారు. ప్రజలకు మేలు జరిగేలా అన్ని రాజకీయ వర్గాల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని, అప్పటి వరకు జర్మన్ బ్యాంకు రుణానికి సంబంధించిన డీపీఆర్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై మున్సిపల్ పాలకవర్గం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, పాల్వంచ మండలాధ్యక్షుడు రాపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తోంది... ప్రజలకు చౌకగా నిత్యావసరాలు ఎందుకు ఇవ్వడం లేదు?

### - కాసాని శ్రీనివాసరావు గౌడ



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) ఆగస్టు 6. :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం గురించి గొప్పలు చెప్పుకుంటూ, ప్రజలకు అత్యంత అవసరమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించే దిశగా మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జై స్వరాజ్ పార్టీ అధ్యక్షుడు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ విమర్శించారు. గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్ర ప్రచారంలో భాగంగా రాష్ట్రంలోని వివిధ గ్రామాలను సందర్శించిన సందర్భంగా ప్రజలు ఒకే మాట చెబుతున్నారని ఆయన అన్నారు. పెరుగుతున్న ధరలతో సామాన్య కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, కేవలం బియ్యం ఇవ్వడం వల్ల జీవితం సాగదని, పప్పులు, వంటనూనె, ఉప్పు, బెల్లం, మసాలా దినుసులు, సబ్బులు వంటి నిత్యావసర వస్తువులను కూడా రేషన్ దుకాణాల ద్వారా సరసమైన ధరలకు అందించాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పెద్ద కార్పొరేట్ కంపెనీల నుంచి కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇవ్వడం కంటే, గ్రామీణ స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు , మహిళా సంఘాలు, స్థానిక కుటీర పరిశ్రమల ద్వారా ఈ వస్తువులను తయారు చేయించి రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసే విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలా చేస్తే రైతు పంటకు విలువ పెరుగుతుందని, గ్రామీణ యువతకు ఉపాధి లభిస్తుందని, మహిళల ఆదాయం పెరుగుతుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. "ప్రజల సంక్షేమం పేరుతో ప్రచారం చేసుకోవడం ఒక్కటే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమా? ప్రజల జీవిత వ్యయాన్ని తగ్గించే శాశ్వత విధానాలు ఎందుకు తీసుకురావడం లేదు? ప్రజలకు చౌకగా నిత్యావసరాలు అందించలేని ప్రభుత్వం సంక్షేమం గురించి మాట్లాడే నైతిక హక్కును కోల్పోతుంది" అని కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు. "ఒకవైపు రైతుకు గిట్టుబాటు ధర లేదని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు గ్రామాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం లేదు. ఇంకోవైపు మార్కెట్‌పై కార్పొరేట్ల ఆధిపత్యం పెరుగుతోంది. ఈ మూడు సమస్యలకు ఒకే పరిష్కారం - గ్రామ స్వరాజ్య నమూనా. గ్రామాల్లోనే ఉత్పత్తి, గ్రామాల్లోనే విలువ జోడింపు, రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు పంపిణీ" అని ఆయన వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుకే పరిమితం కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధానాలపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. లేకపోతే రైతులు, మహిళలు, యువత, వినియోగదారులతో కలిసి జై స్వరాజ్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని చేపట్టి ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఒత్తిడి తీసుకువస్తుందని హెచ్చరించారు. "జై స్వరాజ్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి రేషన్ దుకాణాన్ని 'గ్రామ స్వరాజ్య ప్రజా మార్కెట్'గా అభివృద్ధి చేసి, స్థానిక రైతుల ఉత్పత్తులు, గ్రామీణ కుటీర పరిశ్రమల వస్తువులను నేరుగా ప్రజలకు అందించే విధానాన్ని అమలు చేస్తుంది. ప్రజల డబ్బు గ్రామాల్లోనే తిరిగే ఆర్థిక వ్యవస్థను నిర్మించడమే మా లక్ష్యం" అని కాసాని శ్రీనివాసరావు గౌడ స్పష్టం చేశారు. ఈ బృందంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనగాం వెంకటేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి, రమేష్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# కూలీలతో ఉప ముఖ్యమంత్రి భట్టి 'మాట-మంతి

### గండగలపాడు మార్గంలో పొలాల్లోకి వెళ్లి భట్టి విక్రమార్క

### ఆనందంలో రైతు కూలీలు

### క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాల ఆరా..

### 'ఇందిరమ్మ ఇళ్లతో' మా కలలు నిజమయ్యాయన్న మహిళలు.

### కూలీల చెంతకు 'ప్రజా ప్రభుత్వం



గండగలపాడు నుంచి స్నానాల లక్ష్మీపురం వెళ్లే మార్గమధ్యంలో ఒక అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాన్వాయ్ అకస్మాత్తుగా ఆగింది. భద్రతా సిబ్బంది అలర్ట్ అయ్యేలోపే, ఆయనే స్వయంగా రోడ్డు పక్కన పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతు కూలీల వైపు నడిచి వెళ్లారు. డిప్యూటీ సీఎం తమ వద్దకు రావడంతో కూలీలు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. వారితో చేతులు కలిపేందుకు, మాట్లాడేందుకు అక్కడి వారంతా పోటీలు పడ్డారు.

**'అక్కయ్యా.. పథకాలన్నీ అందుతున్నాయా?'**

పొలం గట్టుపై నిలబడి, కూలీలతో ఎంతో ఆత్మీయంగా భట్టి విక్రమార్క ముచ్చటించారు. నేరుగా లబ్ధిదారులతోనే సంక్షేమ ఫలాల తీరును అడిగి తెలుసుకున్నారు.

**డిప్యూటీ సీఎం అడిగిన ప్రశ్నలివే..**

**"అక్కయ్యా! మన ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ మీకు అందుతున్నాయా?"**

**"మీ ఇంటికి ఉచిత విద్యుత్ సరఫరా వస్తోందా?"**

**"రేషన్ షాప్ నుంచి సన్న బియ్యం తెచ్చుకుని తింటున్నారా?"**

**"అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయా?"**

**ఈ ప్రశ్నలకు కూలీలు ఎంతో సంతోషంగా స్పందిస్తూ..**

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) ఆగస్టు 6. :** "ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నీ మాకు అందుతున్నాయి సార్.. ముఖ్యంగా మాలాంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అని తమ ఆనందాన్ని పంచుకున్నారు.

**ఉపముఖ్యమంత్రి దృష్టికి 'రవాణా' కష్టాలు**

ఇదే సమయంలో కూలీలు తమ రోజువారీ ఇబ్బందులను కూడా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వైరా నుంచి ముసలిమడుగు వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. దీనిపై ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. సాధారణంగా నాయకులు వేదికల పైనుంచి మాట్లాడటం చూస్తాం. కానీ, ఇలా స్వయంగా డిప్యూటీ సీఎం హోదాలో ఉండి కూడా.. కాన్వాయ్ ఆపి, పొలంలోకి వెళ్లి కూలీల కష్టసుఖాలు తెలుసుకోవడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. 'ప్రజా ప్రభుత్వం' అంటే ఇదేనంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గ్రంథాలయంలో ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఆగస్టు 06 (వార్త సంధ్య) :** ప్రముఖ తెలంగాణ సిద్ధాంతకర్త, విద్యావేత్త, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా నేడు గ్రంథాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించిన అనంతరం తెలంగాణ సాధనలో ఆయన చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ గారి పాత్ర చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచా నికి చాటి చెప్పిన మహనీయుడిగా ఆయనను కొని యాడారు. ఉద్యమం కోసం ఆయన చేసిన త్యాగాలు, చూపిన దార్శనికత నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. యువత జయ శంకర్ గారి జీవితాన్ని అధ్యయనం చేసి ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా నిలిచి మహనీయుల జీవిత చరిత్రలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని, చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. కరుణకుమారి మాట్లాడుతూ, జయశంకర్ గారి సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. గ్రేడ్--ΧΧ లైబ్రేరియన్ ఎస్. లలిత కుమారి, లైబ్రేరియన్ మణి మృదుల, ఆఫీస్ ఇంచార్జ్ ఎం. నవీన్ కుమార్ మాట్లాడుతూ జయశంకర్ గారి జీవిత విశేషాలు, తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్ర, విద్యా రంగానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, స్థానిక ప్రముఖులు పాల్గొని ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారికి ఘన నివాళులు అర్పించారు.

## తెలంగాణ భవన్ లో ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఆగస్టు 06 (వార్త సంధ్య)** : ప్రముఖ తెలంగాణ సిద్ధాంతకర్త, విద్యావేత్త, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాత స్వర్గీయ ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బండారి మాట్లాడుతూ, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన మహోన్నత సిద్ధాంతకర్త జయ శంకర్ సార్ అని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడిగా, తెలంగాణ స్ఫూర్తి ప్రదాతగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి దశాబ్దాల పాటు దిక్సూచిగా నిలిచి, తెలంగాణ రాష్ట్ర వాదాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహా జ్ఞాని జయశంకర్ సార్ అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధి, తెలంగాణ ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ కర్తవ్యబద్ధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జయశంకర్ సార్ ఆశయాల సాధనకు కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని బండారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయశంకర్ సార్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## లెక్చరర్‌పై వచ్చిన ఆరోపణలు అపార్థమే
## పూర్తి వివరాలు తెలిపిన యాజమాన్యం, విద్యార్థులు


వార్త సంధ్య
మార్కులు కట్ చేస్తానంటూ బెదిరింపులు..!
లెక్చరర్ ఆగడాలు

**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఆగస్టు 06 (వార్త సంధ్య)** : జూలై 26న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్‌పై వచ్చిన "మార్కులు కట్ చేస్తానంటూ బెదిరింపులు" అనే ఆరోపణలపై కళాశాల యాజమాన్యం చేపట్టిన విచారణ ముగిసింది. గురువారం విచారణ వివరాలను వార్త సంధ్యకు యాజమాన్యం, పలువురు విద్యార్థులు వెల్లడించారు. వారి కథనం ప్రకారం, ప్రయోగశాలలో కొన్ని పరికరాలు దెబ్బతినడంతో వాటి మరమ్మతుల విషయమై లెక్చరర్ విద్యార్థులతో సాధారణ చర్చ జరిపారని తెలిపారు. "మనమందరం కలిసి వాటిని బాగు చేయాలా, లేక అధికారులకు తెలియజేయాలా?" అనే ఉద్దేశంతో మాట్లాడిన మాటలను కొందరు విద్యార్థులు అపార్థం చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ సమాచారం విద్యార్థి సంఘానికి మరో రూపంలో చేరడంతో వివాదం చోటుచేసుకున్నట్లు వివరించారు. ఈ ఘటనపై కళాశాల యాజమాన్యం ప్రతి విద్యార్థితో విడివిడిగా మాట్లాడి వివరాలు సేకరించినట్లు తెలిపింది. విచారణలో లెక్చరర్ విద్యార్థులను డబ్బులు అడిగినట్లు లేదా మార్కులతో బెదిరించినట్లు ఎవరూ ధృవీకరించలేదని యాజమాన్యం వెల్లడించింది. ఈ సందర్భంగా స్పందించిన లెక్చరర్ మాట్లాడుతూ, "నా వల్ల తప్పు జరిగి ఉంటే ఎలాంటి విచారణకైనా సిద్ధమే. అయితే నేను ఎలాంటి డబ్బులు అడగలేదు, విద్యార్థులను బెదిరించలేదు. నాకు వచ్చే జీతంతోనే నిజాయితీగా విధులు నిర్వర్తిస్తున్నాను. అపార్థాల వల్ల జరిగిన ఈ ఘటనను దయచేసి తప్పుడు ప్రచారాలకు వేదికగా మార్చవద్దని మనస్ఫూర్తిగా కోరుతున్నాను" అని తెలిపారు. కళాశాల వర్గాలు కూడా విద్యార్థులు, అధ్యాపకుల మధ్య సమన్వయం మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించాయి.

## యాదవుల ఐక్యతే సంఘ బలోపేతానికి బాట
## బూర్గంపహాడ్ మండల నూతన కమిటీల ఏకగ్రీవ ఎన్నిక



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఆగస్టు 06 (వార్త సంధ్య)** : యాదవుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధే ధ్యేయంగా అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండల నూతన కమిటీలను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాళ్లగొమ్మూరు ఐటీసీ ఫంక్షన్ హాల్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లపు యాకయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కమిటీతో పాటు యువజన కమిటీని ఏర్పాటు చేశారు. మండల గౌరవ అధ్యక్షుడిగా బొడ్డు నరసింహారావు యాదవ్, గౌరవ సలహాదారుగా బండారి లక్ష్మణరావు యాదవ్, మండల అధ్యక్షుడిగా బోళ్ల శ్రీశైలం యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మోదం రాధాకృష్ణ, కోశాధికారిగా చేతుల వలరాజు యాదవ్‌తో పాటు పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యువజన విభాగం అధ్యక్షుడిగా చేతుల శ్రీనివాసరావు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బాసిపోయిన గంగరాజు యాదవ్, కోశాధికారిగా చుక్కా నరేష్ యాదవ్ సహా కార్యవర్గాన్ని కూడా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వల్లపు యాకయ్య యాదవ్ మాట్లాడుతూ, యాదవుల ఐక్యతే సంఘ బలోపేతానికి పునాది అని అన్నారు. కుల, పార్టీ భేదాలకు అతీతంగా ప్రతి యాదవ కుటుంబాన్ని సంఘంతో అనుసంధానం చేయాలని, విద్య, ఉపాధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి సంఘం అండగా నిలవాలని సూచించారు. గ్రామ స్థాయిలో సంఘాన్ని బలోపేతం చేస్తూ యువతను సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అల్లాడి పుల్లారావు యాదవ్, జిల్లా కార్యదర్శులు కుక్కల సాంబయ్య యాదవ్, మారబోయిన శ్రీనివాస్ యాదవ్, యువజన జిల్లా అధ్యక్షుడు గొడపర్తి రాంబాబు యాదవ్, గళ్ళ నాగభూషయ్య, బూరం శ్రీనివాసరావు యాదవ్, చేతుల వీర్రాజు, పిడుగు కొండలరావు, వెంకట రామారావు తదితర సంఘ నాయకులు, యాదవ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యాప్ ద్వారా ఎరువుల పంపిణీ విధానాన్ని రద్దు చేయాలి
### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తిరుపతి డిమాండ్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఆగస్టు 06 (వార్త సంధ్య)** : రైతులు ఎరువులను యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు గంగుల తిరుపతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థులు, కార్మికులు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. విద్యార్థులకు పేపర్ లీకేజీలు, కార్మికులకు లేబర్ కోడ్‌లు, ఇప్పుడు రైతులకు యాప్ ఆధారిత ఎరువుల పంపిణీ విధానం తీసుకురావడం వల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతు వద్ద స్మార్ట్‌ఫోన్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం ఉండదని, యాప్ ఆధారిత విధానం వల్ల చిన్న, సన్నకారు రైతులు ఎక్కువగా నష్టపోతారని పేర్కొన్నారు. రైతులకు సులభంగా ఎరువులు అందేలా పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ప్రభుత్వాలు చరిత్రలో నిలబడలేదని, ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. అలాగే బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలంతా ఖండించాలని పిలుపునిచ్చారు.

# ఇందిరమ్మ చివరి బిల్లు ఎప్పుడూ..?

**నిర్మాణాలు పూర్తై నెలలు గడిచినా చివరి విడత నిధుల జాడ లేదు**

**గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారుల్లో పెరుగుతున్న ఆందోళన**

**మొదటి విడతకే బిల్లులు పెండింగ్...**

**రెండో విడత పరిస్థితి దేవుడెరుగు అంటూ ఆవేదన**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఆగస్టు 06 (వార్త సంధ్య)** : తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో అమలవుతోంది. జిల్లాల వారీగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి దశలవారీగా ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ పథకం అమలులో కీలకమైన సమస్యగా చివరి విడత బిల్లుల విడుదల ఆలస్యం మారిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి నెలలు గడిచినా ప్రభుత్వం నుంచి రావాల్సిన చివరి విడత నిధులు ఇప్పటికీ వారి బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో వేలాది మంది లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది అప్పులు చేసి, బంగారం తాకట్టు పెట్టి, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకుని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామని, ఇప్పుడు చివరి బిల్లు రాకపోవడంతో అప్పులు తీర్చలేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 17,580 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో సుమారు 4,000 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులు ఇప్పటికే గృహప్రవేశాలు చేసి కొత్త ఇళ్లలో నివాసం కూడా ఉంటున్నారు. అయినప్పటికీ చివరి విడత బిల్లులు విడుదల కాకపోవడం తీవ్ర అసంతృప్తికి దారితీసింది. లబ్ధిదారుల కథనాల ప్రకారం, మొదటి విడత నిధులు, తదుపరి విడతలు వచ్చిన తర్వాత చివరి దశలో చెల్లించాల్సిన బిల్లులు మాత్రం నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులు ప్రతి సారి "త్వరలో వస్తాయి", "ప్రక్రియలో ఉన్నాయి", "ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది" అనే సమాధానాలే చెబుతున్నారని వారు అంటున్నారు. కానీ ఆ "త్వరలో" అనే మాట నెలలుగా కొనసాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి అవసరమైన సిమెంట్, ఇసుక, ఇనుము, ఇటుకలు, కూలీల ఖర్చులు గత కొంతకాలంగా పెరిగిపోయాయి. ప్రభుత్వం నుంచి వచ్చే మొత్తంతో పాటు తమ సొంత డబ్బులు కూడా ఖర్చు చేయాల్సి వచ్చిందని లబ్ధిదారులు చెబుతున్నారు. కొందరు కుటుంబ సభ్యుల బంగారం తాకట్టు పెట్టగా, మరికొందరు ప్రైవేటు అప్పులు చేసి ఇళ్లు పూర్తి చేశామని తెలిపారు. ఇప్పుడు చివరి బిల్లు రాకపోవడంతో అప్పులిచ్చిన వారు ఒత్తిడి చేస్తున్నారని, వడ్డీలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే కుటుంబాలే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ఉన్నారు. వీరికి ప్రతి రూపాయి విలువైనదే. ఇల్లు పూర్తయిన తర్వాత ప్రభుత్వం నుంచి రావాల్సిన చివరి విడత నిధులతో అప్పులు తీర్చుకోవాలని భావించినా, బిల్లులు విడుదల కాకపోవడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిందని చెబుతున్నారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. నిర్మాణం పూర్తయి మూడు నెలలు, నాలుగు నెలలు, కొన్ని చోట్ల అంతకంటే ఎక్కువ సమయం గడిచినా బిల్లులు రాలేదని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. పలుమార్లు మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినా సమస్యకు పరిష్కారం కనిపించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. లబ్ధిదారుల మాటల్లో చెప్పాలంటే, "ఇల్లు పూర్తిచేయాలని ప్రభుత్వం చెప్పింది. మేము అప్పులు చేసి అయినా నిర్మాణం పూర్తి చేశాం. గృహప్రవేశం కూడా చేశాం. కానీ చివరి బిల్లు మాత్రం రావడం లేదు. అప్పులిచ్చిన వారు ప్రతిరోజూ డబ్బులు అడుగుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మా బిల్లులు విడుదల చేయాలి" అని కోరుతున్నారు. మరోవైపు, మొదటి విడతలో ఇళ్లు పూర్తిచేసిన వారికే బిల్లులు పెండింగ్‌లో ఉంటే, రెండో విడత లబ్ధిదారుల పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. "మొదటి విడతకే చివరి బిల్లులు రాకపోతే... రెండో విడత పరిస్థితి దేవుడెరుగు" అంటూ పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వ లక్ష్యం పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడం. అయితే నిర్మాణాలు పూర్తయిన తర్వాత చివరి విడత చెల్లింపులు ఆలస్యం కావడం వల్ల ఆ లక్ష్యానికే భంగం కలుగుతోందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సమయానికి నిధులు అందితేనే పథకం పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని పేర్కొంటున్నారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను అధికారులు ఇప్పటికే పరిశీలించి, జియో-ట్యాగింగ్, ధృవీకరణ వంటి ప్రక్రియలు పూర్తి చేసినట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. అన్ని అర్హతలు పూర్తయినా నిధులు జమ కాకపోవడంపై వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది లబ్ధిదారులు చివరి బిల్లు కోసం ఎన్నోసార్లు బ్యాంకులకు వెళ్లి ఖాతాలు పరిశీలిస్తున్నామని, ప్రతి రోజు సందేశాలు వస్తాయేమోనని ఎదురుచూస్తున్నామని చెబుతున్నారు. కానీ నెలలు గడుస్తున్నా ఎలాంటి సమాచారం లేకపోవడంతో నిరాశ చెందుతున్నామని అంటున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయి గృహప్రవేశాలు జరిగిన కుటుంబాల్లో ఆనందం కన్నా ఆర్థిక భారం ఎక్కువైందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఒకవైపు అప్పుల ఒత్తిడి, మరోవైపు వడ్డీలు, మరోవైపు ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బు ఆలస్యం కావడంతో మానసికంగా కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వం వద్ద పెండింగ్ బిల్లుల విడుదల కోసం చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ముఖ్యంగా నిర్మాణాలు పూర్తిచేసి అన్ని నిబంధనలు పాటించిన వారికి ప్రాధాన్యంగా చివరి విడత నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పేదల సొంతింటి కలను నిజం చేసే లక్ష్యంతో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతం కావాలంటే నిర్మాణాలు పూర్తిచేసిన ప్రతి లబ్ధిదారుడికి ఎలాంటి జాప్యం లేకుండా చివరి విడత బిల్లులు విడుదల చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేసి వేలాది కుటుంబాలకు ఊరట కల్పించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లబ్ధిదారులు కోరుతున్నారు.

## 20 ఏళ్లుగా నరకయాతన... చలిమడ - కోతులారం రహదారికి విముక్తి ఎప్పుడూ?




**చలిమడ, :ఆగస్టు -6:(వార్త సంధ్య)** : చలిమడ గ్రామంలోని స్టేజి కాడి నుంచి కోతులారం వరకు వెళ్లే ప్రధాన బీటీ రహదారి గత 20 సంవత్సరాల క్రితం నిర్మించినప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఒకప్పుడు గ్రామ ప్రజలకు సౌకర్యంగా ఉన్న ఈ రహదారి నేడు ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డంతా కంకర తేలిపోవడం, గుంతలు ఏర్పడటం వల్ల వాహనదారులు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వర్షాకాలంలో ఈ రహదారి మరింత దారుణంగా మారి ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతుండగా, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు సైతం సకాలంలో చేరలేని పరిస్థితి నెలకొంది. కనీసం పాదచారులు కూడా సురక్షితంగా నడవలేని స్థితి ఏర్పడడంతో గ్రామ ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.ప్రజల సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ బండమీది యాదయ్య వెంటనే స్పందించి, ఉపసర్పంచ్ అవిశెట్టి మల్లేష్ పాటు గ్రామ యువకుల బృందాన్ని తీసుకుని నల్గొండ జిల్లా గ్రామ పంచాయతీ రాజ్ శాఖ సివిల్ ఇంజనీర్‌ను కలిసి రహదారి దుస్థితిని వివరించారు. రహదారిని వెంటనే మరమ్మతు చేయడంతో పాటు కొత్త బీటీ రోడ్డును మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు.వినతిపత్రాన్ని స్వీకరించిన సివిల్ ఇంజనీర్ సమస్యను సానుకూలంగా స్వీకరించి, రహదారిని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సాంకేతిక నివేదికను సిద్ధం చేసి, రోడ్డు నిర్మాణం జరిగేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసు కుంటానని హామీ ఇచ్చారు.అయితే గ్రామ ప్రజలు మాత్రం ఇక హామీలతో కాలం గడపకుండా, వెంటనే పనులు ప్రారంభించాలని కోరుతున్నారు. రెండు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ రహ దారికి శాశ్వత పరిష్కారం చూపి ప్రజల ఇబ్బందులను తొలగించా లని అధికారులను, ప్రజాప్రతినిధులను విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండమీది యాదయ్య, ఉపసర్పంచ్ అవిశెట్టి మల్లేష్, పగిళ్ల సతీష్ కుమార్, దొంతరగోని రాజు, కట్ట దశరథ, గాదెపాక సుధాకర్, గాదెపాక సైదులు, గుండెబోయిన శ్రీరాములు, తలకొప్పుల గౌరీశంకర్తో పాటు పలువురు గ్రామ యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు

## ఆపదలో అండగా బీఆర్ఎస్...
## బాధిత కుటుంబానికి రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు



**మునుగోడు,: ఆగస్టు -6:(వార్త సంధ్య )** : ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడంలో బీఆర్ఎస్ నాయకులు కీలక పాత్ర పోషిస్తున్నారని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మునుగోడు మండలం పులిపలుపుల గ్రామానికి చెందిన యిరిగిదిండ్ల ఇద్దయ్య (తండ్రి: మారయ్య) అనారోగ్య చికిత్స కోసం ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.60,000 విలువైన చెక్కును బీఆర్ఎస్ నాయకులు పగిళ్ల రాము ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా పగిళ్ల రాము మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.చెక్కు అందుకున్న యిరిగిదిండ్ల ఇద్దయ్య కుటుంబ సభ్యులు తమకు ఆర్థికంగా ఎంతో ఊరట కలిగిందని పేర్కొంటూ, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## సచివాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు
## - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) ఆగస్టు 6:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సచివాలయ ఆవరణలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం, శాంతి, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు.

# రాష్ట్ర ప్రజలకు తీపికబురు

**ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల కొత్త రేషన్ కార్డుల పంపిణీ**

**ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగారెడ్డి లో ప్రారంభం**

**అదే రోజున 119 నియోజకవర్గాలలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ**

**పేద కుటుంబాల ఆహార భద్రతకు తెలంగాణ ప్రభుత్వ చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమం**

**-మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య)ఆగస్టు 6:** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల కొత్తగా మంజూరైన లామినేటెడ్ ప్రజాపంపిణీ వ్యవస్థ రేషన్ కార్డులను ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నుంచి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నీటిపారుదల, ఆహార ౖ పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారిక మెమో జారీ చేశారు. ఈ విషయమై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విడుదల చేసిన ఒక ప్రకటనలో రేషన్ కార్డుల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోందని తెలిపారు. కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ప్రారంభోత్సవం నిర్వహించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) సమన్వయంతో జిల్లా యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. లబ్ధిదారుల జాబితాల ఖరారు నుంచి కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలు, మీడియా ప్రచారం, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ వరకు అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. పేద కుటుంబాల ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తూ, ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రయోజనాలను కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం సంక్షేమ పాలనలో ఇది మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు.

